ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 31 మార్చి, 2026 | పేజీలు : 08

## హేట్ స్పీచ్ హేట్ క్రైమ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అసెంబ్లీలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వివరాలు 2లో..





# సంఘబంధం అక్రమాలపై ఆగ్రహం

## సర్పంచ్‌తోపాటు ఎపిఎం, సిసి నిర్బంధం

**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూరు):** మండలంలోని చెర్వు అన్నారం గ్రామంలోని సంఘ బంధంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంఘ బంధం సభ్యులు మండల ఏపిఎం రాములు, సర్పంచ్ చిలుముల సైదులు, వెలుగు సిసి ప్రసాద్‌లను సోమవారం సాయంత్రం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. ఈ సందర్భంగా సంఘబంధం 2 అధ్యక్షురాలు గద్దపాటి రేణుక మాట్లాడుతూ తాను అధ్యక్షురాలు అయి ఏడాది గడుస్తున్న తమ సంఘం విఓ ఏ చేగోని నాగమణి సంఘం యొక్క లెక్కలు చూపించకుండా దాటవేస్తుందని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో, సంఘం యొక్క డిపాజిట్లలో అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు ఇదే విషయంపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన పైఅధికారులు మొక్కుబడిగా తరువాయి 2లో...





### ఇ-ఆఫీస్ ఫైళ్ళ నిర్వహణకు

# సిద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఏప్రిల్ ఒకటి నుండి ఇ ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ ఆఫీస్ ద్వారా ఫైళ్ళ నిర్వహణ విషయమై ఇదివరకే జిల్లా అధికారులు, వారి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. అందువల్ల జిల్లా అధికారులందరూ ఈఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ళ నిర్వహణకు సంసిద్ధం కావాలని ఆయన కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ఏప్రిల్ 2న గ్రామసభలు నిర్వహించాలని, అలాగే మున్సిపాలిటీలలో మున్సిపల్ వార్డు సభలు నిర్వహించాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనల ప్రకారం గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని చెప్పారు. ఇదివరకు ఆదేశించినట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధి దారుల వివరాలను గ్రామసభలలో చదివి వినిపించాలని, గ్రామసభల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా ఫోటోలు, వీడియోలతో ప్రజెంటేషన్ ఇవ్వాలని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమావేశాల మినిట్స్‌ను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభమైన దృష్ట్యా రానున్న రెండున్నర నెలలు అత్యంత కీలకమని,

తరువాయి 2లో...



2

# ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా వెంటనే ప్రకటించాలి

అఖిలపక్ష కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా తక్షణమే ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆర్యవైశ్య భవనం వద్ద జరిగిన సమావేశంలో కమిటీ నాయకులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వెళుతున్న తమను స్థానిక పోలీసులు ముందస్తుగా కమిటీ సభ్యులను అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. ఈ అరెస్టులు అక్రమమని పేర్కొంటూ, ఇలాంటి చర్యలతో ఉద్యమాలను అణగదొక్కలేరని స్పష్టం చేశారు. ఎన్ని అరెస్టులు చేసినా వెనుకడుగు వేయబోమని, ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని కమిటీ నాయకులు హెచ్చరించారు. గత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బిర్లా ఐలయ్య వంద రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తరువాయి 2లో

## సంఘబంధం అక్రమాలపై ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చి విచారణ చేస్తున్నామని చెప్పి వాయిదాలు వేస్తున్నారన్నారు. గతంలో మూడు వాయిదాలు వేశారని రికార్డులు తేకపోవడంతో ఈరోజు వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. అధికారులు ఉదయం విచారణకు వస్తామని చెప్పి సాయంత్రం వరకు రాకపోవడంతో ఆగ్రహించిన మహిళలు విచారణకు వచ్చిన ఏపిఎం, సీసీలతో పాటు సర్పంచును గ్రామపంచాయతీలో మూడు గంటల పాటు నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళా సంఘాల సభ్యులకు సర్దిచెప్పి వారిని విడిపించారు. వారం రోజుల్లో విచారణ చేసి నివేదికపై అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చారు.

## ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాష్ట్రస్థాయి గ్రీవెన్స్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, ఆర్డీఓ వేణుమాధవరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారంలో ఈ అంశంపై హామీ ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి అధికార ప్రకటన వెలువడలేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరిని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కలిసి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అధికార ప్రకటన విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కోకన్వీనర్లు చెక్క వెంకటేష్, మొరిగాడి శేఖర్, బడుగు జాంగిర్, పుట్ట మల్లేష్, ఉప్పలయ్య, కామిటికారి అశోక్, జూకంటి పౌల్, నమిలే అంజిబాబు, ఎలుగల కుమారస్వామి పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ప్రజాపక్షం/చండూరు : గ్యాస్ డెలివరి చేసే సమయంలో అధిక డబ్బులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్‌కు సోమవారం బిజెపిఎం రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి వినతిపత్రం అందజేసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ డెలివరి సమయంలో అధిక డబ్బులు వసూలు చేయవద్దని ప్రశ్నిస్తే తనపై తప్పుడు ఆరోపణలు చేసిన సంబంధిత గ్యాస్ ఏజెన్సీ, గ్యాస్ డెలివరిచేసే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా స్థాయి అన్ని శాఖలు కట్టుదిట్టంగా రహదారి భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. సభలో జిల్లాలోని రహదారులు, బ్లాక్ స్పాట్లు, గతంలో సంభవించిన రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య, తీసుకున్న చర్యలు వంటి అంశాలను పోలీసులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. తరువాత కలెక్టర్ బి.చంద్రశేఖర్ రహదారి భద్రతపై సమాజంలోని అన్ని వర్గాలకు అవగాహన కల్పించవలసిందిగా, ప్రజా పాలప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సురక్షితంగా చేరుకోండి కార్యక్రమాన్ని ఏప్రిల్ 2న గ్రామ, మున్సిపల్ వార్డు సభల ద్వారా పెద్ద ఎత్తున నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు గత 18 నెలల్లో పోలీసులు, జిల్లా అధికార యంత్రాంగం



చర్యల ద్వారా బ్లాక్ స్పాట్ల సంఖ్య 58 నుండి 38కు తగ్గించగలిగారని, మరణాల సంఖ్య 7 శాతం తగ్గించారన్నారు. ముకుందాపురం, మాడుగులపల్లి, నల్లగొండ టౌన్, హాలియా, నకరేకల్, కొండభీమనపల్లి, దేవరకొండ, చింతపల్లి వంటి రహదారులపై సంభవిస్తున్న ప్రమాదాలను నివారించడానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు.సభలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్ కమిషనర్లు, ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. రహదారి భద్రతకు కృషిచేసిన అధికారులకు కలెక్టర్, ఎస్పిలు అభినందన పత్రాలు అందజేశారు.

## హేట్ స్పీచ్ హేట్ క్రైమ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాపక్షం/మిర్యాలగూడ: హేట్‌స్పీచ్, హేట్ క్రైమ్ బిల్లును చట్టంగా మార్చి పకడ్బందీగా అమలు చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీలో బిల్లుపై ఆయన ప్రసంగించారు. సమాజంలో నైతిక విలువలు క్రమంగా తగ్గిపోతున్నాయని, స్వార్థం, ద్వేషం పెరిగిపోతున్నాయని, తప్పు అని తెలిసినా సరే ఎవరేం చేస్తారులే అనే ధైర్యంతో అడ్డగోలుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ అందులో ఉన్న లొలుసుగులను ఉపయోగించి తప్పించుకుంటూ మళ్లీ అవే తప్పులు చేస్తున్నారని అన్నారు. కులాలు, మతాలు, రాజకీయ వైరుధ్యాన్ని బలంగా ఉపయోగించుకోని ద్వేషాన్ని బలంగా నింపుతున్నారని అన్నారు. సోషల్ మీడియాను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారని అన్నారు. వ్యక్తులను, వారి క్యారెక్టర్లను, కుటుంబసభ్యులను, మహిళలను ఇలా ప్రతి అంశాన్ని ఉపయోగించుకోని ద్వేషాన్ని నింపుతున్నారని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇతర హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టి విద్వేష ప్రసంగాలు పెరిగిపోతున్నాయని అన్నారు. మతం, కులం, జాతి ఆధారంగా చేసే విద్వేష ప్రసంగాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సోషల్ మీడియాలో హేట్ స్పీచ్ సాధారణమైందన్నారు. మహిళలు, విద్యార్థినిలు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏఐ వీడియోలు, గ్రాఫిక్స్‌తో ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. హేట్ స్పీచ్, హేట్ క్రైమ్ నియంత్రణ బిల్లును సీఎం రేవంత్‌రెడ్డి తీసుకురావడం అభినందనీయమని, చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

## సెల్‌టవర్‌ను తొలగించాలని కోరుతూ వినతి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో శుభమస్తు బ్యాంకెట్ హాల్‌పైన నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిర్‌టెల్ ఫైబర్ నెట్ టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కాలనీవాసులు బిసి జెఏసి జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు, బూర వెంకటేశ్వర్లు, బొజ్జ సైదులు, పి.జనార్ధన్, అశీష్‌కుమార్, వసంత, రమ్య, సత్తయ్యలు మాట్లాడుతూ కాలనీలో ఇప్పటికే ఒక సెల్‌టవర్ ఉందని దీంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారు టవర్ ద్వారా వ్యాప్తి చెందే రేడియేషన్‌తో క్యాన్సర్ బారినపడి మరణించడం జరిగిందని వాపోయారు. మరికొంత మంది చికిత్స పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కాలనీలో ఈనెల 14వ తేదీన శుభమ్ బ్యాంకెట్ హాల్‌పైన ఎయిర్‌టెల్ ఫైబర్ నెట్ టవర్‌ను ఏర్పాటు చేస్తుండడంతో



కాలనీవాసులైన తాము అడ్డుకున్నామని చెప్పారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు అన్ని అనుమతులు ఉన్నాయని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఫైబర్ నెట్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్న భవనం ఓనర్‌ను ఆపాలని కోరినా అతను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి టవర్‌ను తొలగించాలని కోరారు.

## మహిళ సమాజ్ భవన ఆక్రమణలను తొలగించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : గత 60 సంవత్సరాల నుండి వెల్లోడి మహిళ సమాజ్ భవనం నుంచి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని మహిళా సమాజ్ భవన లేడీస్ క్లబ్ కార్యవర్గం ఉపాధ్యక్షులు చంద్రావతి, కార్యదర్శి శారద, కోశాధికారి రాధా తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్లోడి మహిళ సమాజ్ భవనం నుంచి ఎన్నో సామాజిక చేపదుతూ మహిళలకు స్వయం ఉపాధి ద్వారా కుట్టు మిషన్లు, నేర్పించడం జరుగుతుందన్నారు. గత కొన్ని రోజుల నుండి ఈ యొక్క భవనం శిథిలావస్థకు చేరడం కార్యక్రమాలు చేపట్టలేకపోయామని తెలిపారు. ఇంతలో ఈ భవనాన్ని మున్సిపల్ వారు ఆక్ర



మణ చేసుకొని పేరు మార్పిడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రి వెంకట్ రెడ్డి కూడా వినతి పత్రం అందజేశామని వారు ఈభవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా సిఫారస్ పంపుతానని తెలియజేశారని అన్నారు.మున్సిపల్ వారు పునరాలోచించి కబోర్డ్ తొలగించాలని లేనియెడల మహిళలు పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగం లక్ష్మి, ఇంద్ర, పుష్ప, సరళ, విజయలక్ష్మి డానియల్ పాల్గొన్నారు.

## ఇ-ఆఫీస్ ఫైళ్ళ నిర్వహణకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

అలాగే జూన్ వరకు ప్రజా పాలప్రగతి ప్రణాళిక, జనగణన, ధాన్యం కొనుగోలు, వంటి ముఖ్యమైన పథకాలను అమలు చేయాల్సి ఉందని, జిల్లా అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అత్యవసరమైతే తప్ప, ఎవరికి సెలవులు ఉండవని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, చండూర్ ఆర్డిఓలు శ్రీదేవి, రమణారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలు కలిగి ఉండాలి



ప్రజాపక్షం/నూతనకల్ : ప్రతి ఒక్కరూ తమ హక్కులతోపాటు, బాధ్యతలను కూడా కలిగి ఉండాలని ఎస్ఐ నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని యడవెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ జటంగి సరిత కృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతినెల చివరి రోజున జరుపుకునే ఈ కార్యక్రమంలో ప్రజలకు పౌరహక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సూచించారు. చట్టాన్ని, హక్కులను దుర్వినియోగం చేయకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రహదారి వినియోగంలో అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/తుంగతుర్తి : ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా రహదారి వినియోగంలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు అన్నారు. సోమవారం తుంగతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగం, ట్రిపుల్ రైడింగ్ ప్రమాదం, పిల్లలకు వాహనాలు ఇవ్వడం ప్రమాదం అంటూ అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. వాహనదారులు వాహనాలు నిదానంగా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతి, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్బంధాన్ని వ్యతిరేకించి నిరసన

ప్రజాపక్షం/నాంపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు)మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సిఐటియు మండల కన్వీనర్ ఎదుళ్ళ సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని, శాంతియుత కార్యక్రమాలు హౌస్ అరెస్టులు మరియు అక్రమ నిర్బంధాలతో అడ్డుకున్న విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు రమావత్ కవిత,కోరే లలిత, శోభ, యాదమ్మ, రజిత, అంజమ్మ, అరుణ, జ్యోతి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల రాస్తారోకో



**ప్రజాపక్షం/చిట్యాల :** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్ళే ఆశా వర్కర్లపై సర్కార్ నిర్బంధాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో సోమవారం ఆశా వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయ్యన్న, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్‌లు పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిరసన వ్యక్తం చేయడానికి ఆశా వర్కర్లకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం వారిని ముందస్తు అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న ఆశా వర్కర్ల మీద అదనపు పనులను చేపిస్తూ వారిచే వెట్టి చాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొబ్బల అరుణజ్యోతి, ఆశా వర్కర్ల సంఘం నాయకులు లక్ష్మి, నీరజ, పద్మ, వాణి, గుత్తా సరిత, వేముల అరుణ, నీలమ్మ, రేణుక, శైలజ, జయమ్మ, శోభ పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గత సంవత్సరం మార్చి 29 నుండి ఈ రోజు వరకు భక్తులు సమర్పించిన కానుకలలో భాగంగా నగదు రూపంలో రూ. 1,53,510 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి తెలిపారు. హుండీ నగదును లెక్కింపులో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటి అధ్యక్షులు మారగోని అంజనేయులు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా అధికారి చింతల పూర్ణ చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీతరమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు కోనేటి ఎల్లయ్య, బొబ్బల సందీప, దేశపాక లత, కుక్కల మోహన్, నాగిళ్ళ సుధాకర్ గాలి యాదమ్మ, నాయకులు వనమా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం, గుడుంబా అమ్మకాలను అరికట్టాలి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలో ఆదివారం మహిళా సంఘం సభ్యులు కలిసి నాంపల్లి గ్రామంలో మద్యం, గుడుంబా అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మద్యం తాగి మహిళలపై జరుగుతున్న వేధింపులను నివారించాలని, చిన్న వయస్సులోనే తాగుబోతులుగా మారుతున్న యువతను ఈ మద్యం మహమ్మారి నుండి రక్షించాలని ఎస్ఐ లింగారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షురాలు బిరుదోజు యాదమ్మ, ఎంఎస్ కోశాధికారి, వీఓ అధ్యక్షురాలు పోలోజు అరుణ, విఓఎల మండల అధ్యక్షురాలు, విఒ కోశాధికారి అరుణ, యస్.కె. సైదాబేగం, ప్రమీల, మంజుల, సుజాత, పరమేశ్వరి, జయమ్మ, ముత్యాలమ్మ, అంజమ్మ, కల్పన, ఉష, సుహాసిని, స్వాతి, సుగుణమ్మ, ఎల్లమ్మ, కోటేశ్వరి, దేవి, శ్రీజ,వెంకమ్మ పాల్గొన్నారు.

## నేడు వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వ సభ్య సమావేశం మంగళవారం ఉదయం 11.30 గంటలకు సంఘం కార్యాలయ భవనంలో నిర్వహించడం జరుగుతుందని సిఈవో నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో 2025,26 ఆర్థిక వార్షిక పరిపాలన నివేదిక, 01/04/2025, 30/09/2025 ఆర్థిక వార్షిక జమా ఖర్చుల ఆమోదం, కొత్త సభ్యత్వాల నమోదు తదితర అంశాలను చర్చించడం జరుగుతుందని తెలిపారు.

## ఫార్మాలో ఉజ్వల భవిష్యత్తు: ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాల యం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లేబరేటరీస్ సహకారంతో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉప కులపతి ఆచా ర్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంలో ఉన్న ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయ సదుపాయాలను విద్యార్థులు సమర్థంగా వినియోగించుకుని పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు.ప్రపంచ వేదికపై ఫార్మా రంగంలో హైదరాబాద్ ముఖ్య కేంద్రంగా ఎదుగుతోందని, దీనిని విద్యార్థులు ఒక గొప్ప అవకాశంగా భావించాలన్నారు.ప్రొఫెసర్ అహ్మద్ కమాల్ తన ప్రసంగంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఉన్న విస్తృత అవకాశాలను వివరించారు. హైదరాబాద్ నగరం ఔషధ పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ఔషధ ఆవిష్కరణలు ప్రాచీన కాలం నుంచి ఆధునిక దశ వరకు ఎలా అభివృద్ధి చెందాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎంఎస్ఎన్ లేబరేటరీస్ చైర్‌పర్సన్ ఆచార్య వసంత అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అహ్మద్ కమాల్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డిబి రామచారి, ప్రొఫెసర్ డి.బి. రామచారి, వై.ప్రశాంతి, జ్యోతి, రమేష్, ఆర్.రూపా, ఎస్. కళ్యాణి, ఎ.శ్రీధర్ రావు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/హాలియా :** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను విచ్చలవిడిగా నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ హెచ్చరించారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాలియాలో నాఖాబంది కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత రెండు రోజులుగా హాలియాలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 23 కేసులు నమోదు చేసినట్లు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ఐదు కే సులు, మైనర్ డ్రైవింగ్ కేసులు మూడు, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 5, కేసులు, వాహనంపై నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు హాలియాలో చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కఠినంగా వ్యవహరించినట్లు చెప్పారు. ప్రమాదాల ని వారణకు నిత్యం వీటిపై అవగాహన కల్పిస్తూ నిర్లక్ష్యంగా వ్య వహరించిన వారిపై కేసులు నమోదు చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆశా వర్కర్ల అరెస్టులకు నిరసనగా నల్ల బ్యాడ్జీలతో ఆందోళన



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలంలోని షారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్సి) వద్ద ఆశా వర్కర్లు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. మార్చి 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వెళ్లిన ఆశా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. టీఆర్ఎస్ పార్టీ, బీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు ఫిక్స్‌డ్ వేతనాలు అమలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముందుగా పోలీసు అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ, నిరసనకు వెళ్లిన ఆశా కార్యకర్తలను మధ్యలోనే అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో షారాజీపేట పిహెచ్సి పరిధిలో పనిచేస్తున్న మొత్తం 32 మంది ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటూ నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పట్టించుకోకుండా అణచివేత విధానాలు అనుసరిస్తోందని వారు ఆరోపించారు. తాము గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను ప్రజలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తగిన గుర్తింపు, సరైన వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేసి, ఫిక్స్‌డ్ వేతన విధానం అమలు చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్ల అరెస్టులపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బంగారిగడ్డ గ్రామంలో చలివేంద్రం ప్రారంభం

- చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- సర్పంచ్ బోయపల్లి సునీతశ్రీనివాసులు




**ప్రజాపక్షం/చండూరు :** మండల పరిధిలోని బంగారిగడ్డ చౌరస్తాలో వేసవికాలంను దృష్టిలో ఉంచుకొని నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ బోయపల్లి సునీతశ్రీనివాసులు , ఉప సర్పంచ్ ఎండి మహబూబ్ , మాజీ జడ్పిటిసి మాదగోని విజయలక్ష్మీ సోమవారం చలివేంద్రంను ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రాయాణికులతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో చలివేంద్రం ను ఏర్పాటు చేయడం పట్ల నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. వేసవి కాలంలో దాహార్తిని తీర్చుకునుటకు బాటసారులు , ప్రయాణికులు ఈ చలివేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య , గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా, జర్నలిస్టు కర్నాటి వెంకటేశం , బిజెపి నాయకులు మాదగోని నాగార్జున , నిమ్మల భిక్షం , బిఆర్ఎస్ నాయకులు పల్లె నర్సింహ్మా, మేడిపల్లి శంకర్ , జక్కలి పరమేష్ వార్డు సభ్యులు తలారి ముత్తయ్య, కొండ్రెడ్డి సాయి కుమార్ , సల్వాది మహేష్ , యూత్ సభ్యులు పల్లె యజ్ఞేశ్వర్ , లెనిన్ ,రాకేష్ , రాజు, సునీల్, కృష్ణ ,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామంలో విపరీతమైన దోమలు ఉండడం ద్వారా గ్రామ ప్రజల ఆరోగ్యం బాగుండాలని గ్రామ ప్రజల కోరిక మేరకు గత 15 రోజుల క్రితం దోమల నివారణ నూతన మిషన్ కొనుగోలు చేసి సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో దోమల మందు గ్రామంలో ఉన్న ప్రతి వార్డు తిరుగుతూ గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి దోమల మందు పిచికారి చేయించడం జరిగినది. మంచి కార్యక్రమం చేస్తున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డికి మరియు వారి పాలకవర్గానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్, వార్డ్ మెంబర్లు చిన్నపాక రమేష్, పెరుమాండ్ల నవీన్, ముత్యాల కిషన్, శానగొండ మల్లికార్జున్, నాగటి ఉపేందర్, బోయిన ఐలమ్మ, నోముల ఉమారాణి, కట్ట తనుశ్రీ, శానకొండ రవళి తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం శక్తితో ఎదగాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** యువత స్వయం శక్తితో ఎదగాలని బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం ఆయన కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డులో సెంట్రల్ బ్యాంక్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ హనుమాన్ మెడికల్ ఏజెన్సీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన మందులను సరసమైన ధరలలో ప్రజలకు విక్రయించాలని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కేతావత్ బిల్యానాయక్, సర్పంచులు పసునూరి యుగేందర్‌రెడ్డి, రమావత్ తులసిరాం, ఇరిగి రామకృష్ణ, గుండెబోయిన లింగం, రైబసా మాజీ అధ్యక్షులు కేసాని లింగారెడ్డి, మారం రవీందర్‌రెడ్డి, విప్పలపల్లి జితేందర్, లింగం, శంకర్‌నాయక్, బిక్య,మెడికల్ ఏజెన్సీ యాజమాన్యం అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు పశువులకు టీకాలు వేయించాలి..సర్పంచ్



**ప్రజాపక్షం/గుండాల:** ప్రతి రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని గుండాల మండలం పాచిల్ల గ్రామ సర్పంచ్ అల్లంశెట్టి మహేష్ సూచించారు. సోమవారం గ్రామంలో పశు సంవర్థక శాఖ, మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పందుల రమేష్, విపి రాజు, గోపాలమిత్రలు గోవింద్, శ్రీను, శేఖర్, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పోరెల్లి దాసు వర్ధంతి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** పోరాట యోధుడు కామ్రేడ్ పోరెల్లి దాస్ ఆరవ వర్ధంతి వేడుకలను సోమవారం మండల కేంద్రంలో పలు సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన మహోత్తర పోరాటంలో తన తుదిశ్వాస వరకు ఎర్ర జెండా అడుగుజాడల్లో నడిచిన మహోన్నత గొప్ప నాయకుడని జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ ఆశ పోరాట సమితి, సిపిఎం నాయకులు పిడమర్తి లింగయ్య, మామిడి రాజయ్య, నాగయ్య, రవీందర్, వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి హెచ్చరించారు. సోమవారం సిపిఎం సూర్యాపేట జిల్లా కమిటి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

## ఉపాధ్యక్షుడిగా గట్ల నర్సింహారావు విజయం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గట్ల నర్సింహారావు ఘన విజయం సాధించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 105 ఓట్లు పోల్ కాగా, నర్సింహారావుకు 63 ఓట్లు, ఆయన ప్రత్యర్థి ఉయ్యాల నర్సయ్యకు 41 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లకుండ పోవడంతో 22 ఓట్ల మెజార్టీతో గట్ల నర్సింహారావు విజేతగా నిలిచినట్లు ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి రామకృష్ణారావులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు శరత్‌బాబు, సిలివేరు వెంకటేశ్వర్లు, నవీన్, శ్రీధర్, రహీం, ధనలక్ష్మి, దుర్గ, హేమలత, రంజాన్‌పాషా, రియాజ్ పాల్గొన్నారు..

# నిరంతరాయంగా నీటిని విడుదల చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఏప్రిల్ నెల మొత్తం ఎస్ఆర్ఎస్‌పి నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ అధికారి ఈఈ యాదగిరికి నీటిని విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించి అనంతరం మాట్లాడారు. వారబంది ప్రకారం ఇవ్వడంతో 50 శాతం పైన వరి పొలాలు నాటిన రైతులు నష్టపోయారు, మిగిలిన రైతులకు కనీసంగా ఏప్రిల్ నెల మొత్తం నిరంతరాయంగా నీరును అందిస్తే కనీసం 50 శాతం మంది రైతులు తమ పంటను కోసుకునే అవకాశం ఉంటుందన్నారు. లేనిపక్షంలో రైతులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాషిపంగు సునీల్, అనంతుల యల్లయ్య, నారాయణరెడ్డి, కళావతి, భూక్య వెంకన్న పాల్గొన్నారు.



# సంపూర్ణ మద్యనిషేధానికి అధికారుల మద్దతు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పెన్‌పహాడ్ మండలం చెట్లముకుందాపురం గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం చేయాలని గ్రామ పంచాయితీ పాలకవర్గం తీర్మానం చేసి, గ్రామంలో ర్యాలీ తీయడం జరిగింది. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తీర్మానానికి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్ సంబంధిత అధికారులకు వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనుగోటి నరేందర్, వార్డు మెంబర్ సూరపల్లి సైదులు, నాయకులు సతీష్, వంశీ పాల్గొన్నారు.

# వరే కాకుండా ఇతర పంటలు సాగు చేసుకోవాలి

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రైతులు వరి పంటనే కాకుండా ఇతర పంటలు సాగు చేసుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోనుగోడు రైతు వేదికలో పంట వైవిద్యేకరణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోనుగోడు, గడ్డిపల్లి, కీతవారిగూడెం, గరిడేపల్లి గ్రామాల నుండి సుమారు 30 మంది రైతులు సదస్సుకు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రియతం కుమార్, ఎఇవో మనోజ్, గ్రామ సర్పంచ్ కటికం వేణు, పిఎసిఎస్ సిఈవో ఉపేందర్, రైతులు దేవిరెడ్డి, పాపిరెడ్డి, సజ్జల నాగిరెడ్డి, సుందరి బసవయ్య, జోగు శంభిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




**ప్రజాపక్షం/కోదాడ:** మాదిగలకు ఇచ్చిన ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైద్రాబాద్‌లోని ఇందిరపార్కు వద్ద నిర్వహించనున్న నిరహారదీక్షకు కోదాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బచ్చలకూర నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బచ్చలకూర నాగరాజు మాట్లాడుతూ చేవెళ్ల డిక్లరేషన్ హామీలను ప్రభుత్వం విస్మరించిందని, మాదిగలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ప్రతిదళిత కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థికసాయం అందించేలా ప్రభుత్వం వెంటనే కార్యచరణను ప్రకటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం యాదగిరి, బాణాల అబ్రహం, పోలంపల్లి శ్రీనివాస్, బొల్లెపంగు స్వామి, హుస్సేన్, కందుకూరి నాగేశ్వరరావు, పిడమర్తి బాబురావు, గురుస్వామి, బాలసైదులు, పందు, మాతంగి అఖిల్ పాల్గొన్నారు.

## ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడం ఆర్‌టిసి డ్రైవర్ల విధి అని సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమంపై సోమవారం పట్టణంలోని ఆర్‌టిసి డిపో ముందు బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, ప్రయాణ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నిబంధనల ప్రకారం వాహనాలను నడుపాలని, అతివేగంగా వెళ్ళకుండా నిదానంగా వెళ్లాలని సూచించారు. అనంతరం సిబ్బందితో వాహనాలను జాగ్రత్తగా నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆర్‌టిసి అధికారులు, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఆర్‌టిసి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టైఫండ్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ వృత్తి విద్యలో భాగంగా అగ్రికల్చర్ రంగంలో పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం స్టైఫండ్, సర్టిఫికెట్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నకుమారి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి విద్యలో ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవడంలో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యానికి వ్యతిరేకం

**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెట్ స్పీచ్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు వాక్ స్వాతంత్రానికి వ్యతిరేకమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ స్పష్టం చేశారు. సోమవారం కోదాడలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల, ప్రజల గొంతు నొక్కేందుకే ఈ బిల్లు ప్రవేశపెడుతుందని విమర్శించారు. సదరు బిల్లులో స్పష్టత లేదని ప్రజలు భావ ప్రకటన స్వతంత్రాన్ని హరించేందుకు కుట్రపన్ను తుందన్నారు. ప్రభుత్వ అవినీతిని, వైఫల్యాలను ఎండగట్టిన క్రమంలో హేట్ స్పీచ్‌గా చిత్రీకరించే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే వి ద్వేషాలను అరికట్టేందు కు కేంద్ర చట్టాలు ఉన్నాయని, మరిన్ని కఠినతరమైన అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని తేవ డం ప్రాథమిక హ క్కులను భంగం కలిగించడమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను విమర్శించడం సహజమని ఈ బిల్లులోని నిబంధనలు విమర్శ విద్వేశం మధ్య ఉన్న గీతను చెరిపేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు బిల్లును వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు

## సృజనాత్మకతను వెలికితీయాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు బాల్యం నుంచే గుర్తించి వెలికితీయాలని ఎంఈఓ బాలు నాయక్ అన్నారు. సోమవారం జాజిరెడ్డిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గోడపత్రిక కమిటి ద్వారా సేకరించిన 100 అత్యుత్తమ చిత్రాలతో రూపొందించిన మై ఇమేజినరీ ఇమేజెస్ 2025–26 పుస్తకం 10వ ఎడిషన్‌ను ప్రధానోపాధ్యాయురాలు విమలకుమారి, ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలల్లో బాలల సంఘాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి వారిలో చిన్నప్పటి నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, సృజనాత్మకతను వెలికితీస్తూ ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఉత్తమ చిత్రలేఖనం వేసిన పాక రుషికేశ్ యాదవ్, జె తులసి, ఆర్ వర్షితలకు ప్రత్యేక మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, వెంకటేశ్వర్లు, నాగరాజు, యాదగిరి, నాగరాజు, మంజుల, రమేష్ పాల్గొన్నారు.

## మహిళ రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి

**ప్రజాపక్షం/మునగాల:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మ హిళ రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా తప్పని సరిగా కల్పించాలని బిసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సైదులు ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పాలన వ్యవస్థలో వెనుకబడిన వర్గాల మహిళలకు సరైన ప్రాతినిధ్యం దక్కకపోవడం ఆందోళనకరమని తెలిపారు. దేశ జనాభాలో మహిళలు దాదాపు 40శాతం ఉన్నప్పటికీ రాజకీయ రంగంలో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉ ండటం దురదృష్టకరమని అన్నారు. బిసి మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ఇంకా వెనుకబడి ఉండటంతో వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించకపోతే నిజమైన సమానత్వం సాధ్యమవదని అన్నారు. కొద్ది వర్గాలకే అధికారాలు కేంద్రీకృతమయ్యాయని, భవిష్యత్‌లో అన్ని వర్గాల మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బిసి మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కల్పించడం ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బిఆర్ఎస్ నాయకులను సోమవారం గరిడేపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాజీ సర్పంచులు, పార్టీనాయకులను అడ్డుకోవడం పట్ల బిఆర్ఎస్ శ్రేణులు అగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు విడుదల చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీతా రామారావు, మండల ప్రధాన కార్యదర్శి మన్సూర్‌అలీ, పిడమర్తి అంజి, మామిడి వెంకటేశ్వర్లు, కీత నాగరాజు, నగేష్, చిట్యాల లింగయ్య, కాశీ పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల లైసెన్సులు రద్దు చేయాలి

**ప్రజాపక్షం/వేములపల్లి :** మండలంలోని మీసేవ కేంద్రాలు సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పెదమం భరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మండల కేంద్రంలో రెండు మీసేవ కేంద్రాలు ఉన్నప్పటికీ అవి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని తెలిపారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు తరచూ కేంద్రాలు మూసివేసి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో ప్రజలు సమీపంలోని మిర్యాలగూడ పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇలాంటి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మీసేవ కేంద్రాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని,వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు పేరం విలేకర్, గోపి, సతీష్, శివ పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లను వెంటనే అమలు చేయాలి: జిల్లా యాదగిరి




**ప్రజాపక్షం/వేములపల్లి :** వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పెన్షన్లు వెంటనే అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఓ జితేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అయినప్పటికీ రాష్ట్రంలో కొత్త పెన్షన్లు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల హామీలో భాగంగా వృద్ధులు, వితంతువులకు రూ.4,000, వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇస్తామని ప్రకటించి,అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నిలబెట్టుకోలేదని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బస్కా పరమేష్, జిల్లా యశ్వంత్, వెంకన్న, శీను, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మునుకుంట్ల పాఠశాలలకు ఆర్వో ప్లాంట్, కంప్యూటర్లు అందజేత

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మునుకుంట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం కోసం గజ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆరో ్వ ప్లాంట్‌ను, లాంగ్వేజ్ స్కిల్ డెవలప్మెంట్ బేస్డ్ లెర్నింగ్ కోసం కంప్యూటర్‌ను బహుకరించింది. అలాగే హై స్కూల్ విద్యార్థుల కోసం కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశా రు. ఈసందర్భంగా కంపెనీ చీఫ్ మేనేజర్ ఊట్కూరు జనార్థన్ మాట్లాడుతూ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మరో చీఫ్ మేనేజర్ అ ప్పలకొండ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసిం చి నిజాయితీ, క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కంపెనీ ఇంజనీర్ సాయి కుమార్, సర్పంచ్ నరే ష్, ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, హైస్కూల్ హెచ్ఎం షమీమా బేగం గజ ఇంజనీరింగ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మర్రిగూడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ శాలిని, డాక్టర్ దీపక్, సిఎచ్‌సి సూపరింటెండెంట్ కలిసి ప్రారంభించారు.క్యాంపులో ఆర్థోపెడిక్,జనరల్ ఫిజీషియన్, డెంటల్, పీడియాట్రిక్, అస్తమా, గైనకాలజీ విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి క్యాంప్‌ను విజయవంతం చేశారు.

# అక్షర ఉత్సవం.. చెరుకుపల్లిలో మార్మోగిన బడిబాట నినాదం




**ప్రజాపక్షం/డిండి :** ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, విద్యా కుసుమాలు వికసించాలనే సంకల్పంతోనే గుండల్లపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో బడి బాట కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం ఉద యం జెడ్పిహెస్కూల్ మరియు ఎంపిపిఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ వీధుల్లో ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది... **ప్రజా ప్రతినిధుల చొరవ....విద్యా వేత్తల అడుగుజాడలు** గ్రామ సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, గెజిటెడ్ హెచ్ఎం ఇస్లావత్ గోప్యనాయక్ ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని ఏ ఒక్క బిడ్డ కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ ముందస్తు బడిబాట నిర్వహిస్తున్నాం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పిస్తూ కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయ బృందం మరియు ప్రజా ప్రతినిధులు కలిసి ఎండను సైతం లెక్కచేయకుండా గ్రామంలోని ప్రతి ఇంటికిని సందర్శించారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరిని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

**ప్రభుత్వ రాయితీలు-విద్యార్థులకు వరం...**

గెజిటెడ్ హెచ్ఎం గోప్యనాయక్ మరియు ఎంపిపిఎస్ హెచ్ఎం ముడి శ్రీనయ్యలు విద్యార్థులకు అందే ప్రయోజనాలను వివరించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫాంలు, షూలు, సాక్స్ మరియు బ్యాగుల పంపిణి ఉంటుందని తెలిపారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు ప్రవేశపెట్టిన రాగిజావ విశిష్టతను వివరించారు.

**యువత పిలుపు....విద్యా పరిరక్షణే లక్ష్యం...**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ చిట్టెమ్మ, విద్యావేత్త జంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మనుగడ గ్రామ అభివృద్ధికి చిహ్నమని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి సభ్యులు , గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈకార్యక్రమం గ్రామంలో విద్యా చైతన్యాన్ని నింపింది, అది ఒక సామాజిక బాధ్యత అని చాటి చెప్పారు.

# రూ.18 వేల వేతనం హామీ అమలు చేయాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఆశ వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్ వేతనం హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సోమవారం నకిరేకల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. చలో హైదరాబాద్" కార్యక్రమానికి వెళ్లకుండా ఆశా కార్యకర్తలను ఇండ్ల వద్దనే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లకపాక రాజు,జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్ వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఆహామీ అమలు చేయకపోవడంతోనే చలో హైదరాబాద్‌కు పిలుపు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం ముందుగా అనుమతి ఇచ్చి వెంటనే రద్దు చేయడం కుట్రపూరిత చర్య అని విమర్శించారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం, ఉద్యోగ భద్రత,పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు తవితి వెంకటమ్మ,జిల్లా కమిటీ సభ్యులు వంటేపాక వెంకటేశ్వర్లు, ఆదిమల్ల సుధీర్, వనపర్తి సునీత, చెరుకు జానకి, నవనీత,రేణుక తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధానికి వ్యతిరేకంగా 4న శాంతి ర్యాలీ



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై చేస్తున్న అధర్మ యుద్ధాన్ని ఖండిస్తూ భారీ ర్యాలి నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల నాయకులు రామయ్య, సత్యనారాయణరావు, ఖాజా హమీదొద్దిన్‌లు తెలిపారు. మంగశారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద వారు మాట్లాడుతూ అమెరికా పాల్పడుతున్న అధర్మ యుద్ధంతో లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభంతోపాటు ప్రాణ నష్టం, చమురు నిల్వల కొరత ఏర్పడుతుందన్నారు. ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోని ప్రపంచ శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, కస్తూరి ప్రభాకర్, మాలోతు దశరధ్‌నాయక్, ఖాదర్, షరీఫ్, బాలస్వామి, కిరణ్మయి, చేగొండి మురళీయాదవ్, మహేష్, జాని, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌పివి వ్యాక్సిన్ వేయిద్దాం

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారిద్దాం

ముస్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు



**ప్రజాపక్షం/చండూరు :** మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న హెచ్‌పివి వ్యాక్సిన్ కేంద్రాన్ని సోమవారం చండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ మాసరాజు, డాక్టర్ సంధ్యాబెస్లీతో కలిసి పారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వార మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చునని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ వ్యాక్సిన్ కు వేల రూపాయల ఖర్చుఅవుతుండగా ప్రభుత్వ ఆసుపత్రులలో దీనిని పూర్తిగా ఉచితంగా అందింస్తున్నారని అన్నారు. అర్హులైన బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ మాస రాజు మాట్లాడుతూ 14,15 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలు వారి తల్లిదండ్రుల సమక్షంలో హెచ్‌పివి వ్యాక్సిన్‌ను వేయనున్నట్లు వివరించారు. వ్యాక్సిన్ కు అర్హులైన బాలికలు తమ ఆధార్ కార్డు జీరాక్స్ తీసుకొచ్చి చండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ టీకాను తీసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యాబ్లెస్సి, సూపర్‌వైజర్ ఝాన్సీ, ఏఎన్ఎంలు రజిని, మెహబూబీ, మంగమ్మ ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అర్ధరాత్రి ఆశాల అరెస్ట్



**ప్రజాపక్షం/వేములపల్లి:** వేములపల్లి ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెళ్లిన ఆశా కార్యకర్తలను అర్ధరాత్రి అరెస్టు చేయడం అమానుషమని సిఐటియు జిల్లా నాయకుడు రెండు శ్రీనివాస్ విమర్శించారు.హక్కుల కోసం పోరాడే వారిని అణచివేయడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన అన్నారు.అలాగే, ప్రభుత్వం వెంటనే ఆశా కార్యకర్తలను గుర్తించి కనీస వేతనం రూ.18వేలుగా నిర్ణయించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్‌కు చెందిన రాధిక, దేవకమ్మ, విఘ్నేశ్వరి, సుజాత, ఝాన్సీ, మణెమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి




**ప్రజాపక్షం/త్రిపురారం :** ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని త్రిపురారం సర్పంచ్ బైరం లక్ష్మీ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి టీవీ సుఖ వ్యాధుల లక్షణాలు గల వాలు పోస్టర్ను గ్రామ పంచాయతీ కార్యాలయం పై శాశ్వతంగా వ్రాయించారు.ఈసందర్భంగా సర్పంచ్ లక్ష్మీ కృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల బాధ్యతగా ఉండాలని ఎయిడ్స్ నిర్మూలన కు సర్పంచ్ తమ సొంత ఖర్చులతో గ్రామపంచాయతీ గోడపై శాశ్వతంగా వాల్ పోస్టర్ ను ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు అధికారులు పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.ఈ కార్యక్రమంలో డిపి నరసింహ చారి, ఎల్ డబ్ల్యూ ఎస్ గాయత్రి, పంచాయతీ సెక్రెటరీ రాజేంద్ర కుమార్, పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/త్రిపురారం :** పశుసంపదను పరిరక్షించుకునేందు కు వాటికి వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను త్రిపురారం పశువైద్యాధికారి సిహెచ్ నాగేంద్ర అంజనపల్లి పశువైద్యాధికారి శశికళ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సోమవారం దుగ్గేపల్లి బొర్రాయపాలెం గ్రామాల్లో గోపాలమిత్ర పశువైద్య శిబిరాలను దుగ్గేపల్లిసర్పంచ్ మేకల వెంకట్ బొర్రాయపాలెం సర్పంచ్ రాయనబోయిన పుల్లయ్య కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులలో వచ్చే వ్యాధులను గుర్తించి వాటిని అరికట్టి పశువులను కాపాడుకోవాలన్నారు.35 ఆవులకు వివిధ రకాల వ్యాధులను గుర్తించి 341 గేదెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో కృష్ణ, హుస్సేన్, రామకోటి రేణుక పాల్గొన్నారు.

## సర్పంచులకు సన్మానం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట నియోజవర్గ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న రామన్నపేట నియోజక సాధన సమితి ఆధ్వర్యంలో అందరి సహకారం ఉండాలని ఆలోచనతో ఈ మధ్యనే ఎన్నికైన సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే పల్లివాడ సర్పంచ్ కమ్మంపాటి శ్రీనివాస్, ఎల్లంకి సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్, సర్నేనిగూడెం సర్పంచ్ గంగాదేవి స్వామి లకు సన్మా నం చేశారు. రామన్నపేట నియోజకవర్గాన్ని సాధించుకుందామని సర్పంచ్‌లతో జరిగిన చ ర్చలో వారు సానుకూలంగా స్పందించి ఎలాగైనా రామన్నపేటని నియోజకవర్గంగా చూడాల ని మాకు ఉందని మేము కూడా అందులో భాగస్వాములమై సహకరిస్తామని, రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెం ట్ ఎర్ర రమేష్ గౌడ్ అన్నారు. సన్మాన కార్యక్రమాలలో పోష బోయిన మల్లేశం, నియోజకవర్గ సాధన సమితి కార్యదర్శి గడ్డం యాదగిరి, ఎండి. ఫజల్, నకరెకంటి అశోక్, బోయిన ఆనం ద్, పెండెం రవీందర్, పోష బోయిన మల్లేష్, దండుగుల రాములు, వనం చంద్రమౌళి, శ్రీ రామోజీ నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

## 22 వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** 22 వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ అన్నారు. సోమవారం భువనగిరిలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మొదటి కౌన్సిల్ సమావేశం, బడ్జెట్ సమావేశంలో గౌరవ ఎమ్మెల్యేకి, చైర్పర్సన్‌కి అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నల్లగొండ చౌరస్తా వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజి గుంతను బాక్స్ కల్వర్టు కట్టి తొందరగా ఆ సమస్యను తీర్చాలని కోరారు. అలాగే ఇందిరానగర్లో వాటర్ ట్యంకు మంజూరు చేసినందుకు ధన్యవాదములు తెలిపారు. అలాగే పట్టణంలో పెద్ద డ్రైనేజీలతో పాటు వార్డుల్లో కూడా డిసిల్టింగ్ చేయాలన్నారు.

## బాలచందర్‌కు నంది అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని పడమటి సోమవారం గ్రామానికి చెందిన బుర్రి బాలచందర్ గౌడ్ చేసిన సేవలను గుర్తించి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ కళా నిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో ఉగాది రోజున దైవజ్ఞ శర్మ సినీనటుడు శ్రీనివాస్ చేతుల మీదుగా తెలంగాణ సరస్వతి పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నంది అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఉద్యమకారుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/రామన్నపేట :** మార్చి 31న జరగాల్సిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం వాయిదా ప డిందని అయినా పోలీసులు అ క్రమ అరెస్టులు చేశారని, ఉద్యమకారుల ఫోరం పిలుపు లేకున్నా తమను అరెస్టు చేయ డం సరికాదని తెలంగాణ ఉద్యమకారులు ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని సంఘాల నాయకులు ఒక తాటిపై వచ్చి పిలుపునివ్వాలని కో రారు. తెలంగాణ ఉద్యమకారుల ప్రధానమైన డిమా ండ్లు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి నిజమైన ఉద్యమకారుల గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల స్థలం, రూ.25 వేల పింఛన్ ఇవ్వాలి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అ మరులైన కుటుంబాలను ఆదుకోవాలి. తెలంగాణ ఉద్యమకారుల కు 10 లక్షల రూపాయల మెడికల్ సౌకర్యం కల్పించాలి. ఉద్యమకారుల ప్రత్యేక సంక్షే మ బోర్డు ఏర్పాటు చేసి పదివేల కోట్ల రూపాయలతో ఉద్యమకారులను ఆదుకోవాలి. ఉద్యమకారులపై ఉ న్న కేసులను అన్ని ఎత్తివేయాలని షేక్ చాంద్ మరి యు ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నో ముల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, ఉద్యమ నాయకులు ఎం డి ఇమామ్ సాబ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన నాయకులు సస్పెండ్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా పనిచేసి కౌన్సిలర్స్ ఓటమికి కారణమైన ఆ పార్టీ ముఖ్య నాయకులు భారత వాసుదేవ్ మచ్చ శేఖర్‌లను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం పోచంపల్లి టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన పత్రిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే నిర్ణయించిన బలమైన అభ్యర్థులను పోటీలో నిలిపినప్పటికీ పార్టీలోనే ఉంటూ బిఆర్ఎస్ పార్టీకి రహస్యాలు చెబుతూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను కక్షతో కూటమికి కారకులయ్యారని తీవ్రంగా మండిపడుతూ క్రమశిక్షణ కమిటీ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 4,5,6,7,9వ,11వ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులకు సన్నిహితంగా ఉంటూనే కొంతమంది ఏర్పాటు వాదులు ఇతర పార్టీలతో చేయి కలిపి గెలవకుండా, మున్సిపల్ చైర్మన్ పదవి దక్కకుండా కుట్రలు పన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వార్డులో ఉన్న వ్యతిరేక శక్తులను త్వరలోనే రుజువులతో సహా బయట పెట్టి పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై పని చేయాలని సమన్వయంతో ఓర్పుతో పార్టీ కోసం పని చేసే వారికే రానున్న రోజు ల్లో పదవులు అందుతాయని స్పష్టం చేశారు. ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే ఏ పార్టీలో కూడా నిలువ నీడ లేకుండా చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి కౌన్సిలర్ గా పోటీ చేసి ఓడిపోయిన నల్ల నాగేష్, బాత్క శంకర్, గంజి గణేష్, మంగళపల్లి రమేష్, కుడికాల రామనసింహలకు 4,5,6,7,11వ వార్డ్ ఇన్చార్జిలుగా నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే ద్వారా ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రజిని శ్రీనివాస్ గౌడ్, 13వ కౌన్సిలర్ రాధిక రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొట్టం కరుణాకర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల రామన్నపేటలో నేడు జాతీయ సదస్సు

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్రం మరియు భౌతికశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యలో అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలు మరియు సమకాలీన పురోగతి' అను అంశంపైన మంగళవారం జాతీయ సదస్సు నిర్వహించబడుతుందని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు. ఈ సదస్సు ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం, కీలకోపన్యాసకులుగా హైదరాబాద్ కేంద్రీ య విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. కృష్ణారెడ్డి, గౌరవ అతిథులుగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.అంజి రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.నరేష్ రెడ్డి, ప్రత్యేక అతిథులుగా స్థానిక సర్పంచ్ గరికపాటి సత్యనారాయణ,ఈడెం రాధా శ్రీనివాస్, టి.మురళీధర్ వస్తున్నారని అన్నారు. అదేవిధంగా ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖకవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్, గౌరవ అతిథులుగా కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ బండారు రామకృష్ణ, జేఎన్టీయూ అధ్యాపకులు డాక్టర్ సురేష్ శ్రీపాద, చేవెళ్ల డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఏ మాలిక్ తదితరులు వస్తున్నారని తెలియజేశారు.. జి.సునీత మాట్లాడుతూ ఒక రోజు జరిగే ఈ జాతీయ సదస్సులో పరిసర ప్రాంతాలలోని ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

## అరుణోదయ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నిక

### కుమారస్వామి, యెలగందుల సిద్దులు





**ప్రజాపక్షం/ఆలేరు :** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా 7వ మసభ ఆదివారం ఆలేరు ఫ్రెండ్స్ క్ల బ్‌లో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. అధ్యక్షుడిగా శికిలం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా యెలగందుల సిద్దులు ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పద్మ సుదర్శన్, ఇక్కిరి సహదేవ్, మామిడాల బాలమల్లేష్, మాలోత్ మోతీలాల్, మారుజోడు సిద్దేశ్వర్, ఆర్. ఉదయ్ తదితరులు ఎన్నికయ్యారు. ఒక కో ఆప్షన్ సభ్యునితో కలిపి మొత్తం తొమ్మిది మంది సభ్యులతో కొత్త కార్యవర్గం ఏర్పడినట్లు నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏప్రిల్ 10, 11 తేదీలలో హైదరాబాద్లో జ రగనున్న అరుణోదయ తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పరిస్థితులపై స్పందిస్తూ, ఇర్నా అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. ప్రపంచ శాంతి కోసం కళాకారులు గళమెత్తాలని, ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. దేశంలో మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కళారూపాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రైతులు ప్రభుత్వం కేటాయించి న ధాన్యపు కొనుగోలు కేంద్రాల వద్దనే తమ ధాన్యాన్ని విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని పోచంపల్లి పిఏసిఎస్ పర్సన్ ఇంచార్జ్ కె.వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. పురపాలక కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో పి ఎసిఎస్ ఆధ్వర్యంలో దాదాపు 28 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి సుమారు 70 కోట్ల పైచిలుకు డబ్బులను రైతులకు అందజేసినట్లు తెలిపారు. రబీ సీజన్ కోసం రైతులు అన్ని విధాలుగా ఏ ర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. సీఈవో బాల్‌రెడ్డి సంఘం జమ ఖర్చులు వ్యవసాయ సంబంధ ఎరువులు ఇతరత్రా వి షయాల నివేదికను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ బోనగిరి డైరెక్టర్లు మద్ది అంజిరెడ్డి, సర్పంచులు చుక్క శోభా శంకర్, సిబ్బంది శ్రీధర్ రెడ్డి, నానిరెడ్డి, రైతు బొక్క బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## గురుకులంలో హెల్త్ క్యాంపు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాదాద్రి జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్, జిల్లా రోగనిరోధక అధికారి డాక్టర్ రామకృష్ణ, ఆర్‌బిఎస్‌కే డాక్టర్ జి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో అడ్డగూడూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సోమవారం స్పెషలిస్ట్ డాక్టర్లచే హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా పీడియాట్రీషియన్ డాక్టర్ నవీన్ సింగ్, డెంటల్ డాక్టర్ గాంధీ, డాక్టర్ స్వప్న ఆప్తల్మలజిస్ట్, డాక్టర్ సుప్రియ గైనకాలజిస్ట్, ఫార్మసీ ఆఫీసర్ కళ్యాణి, కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అడ్డగూడూరు స్టాఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ సిపిఆర్ ట్రైనింగ్, స్ట్రెస్ మేనేజ్మెంట్ గురించి వివరించారు.

## పశువులకు గాలికుంటు టీకాలను ఇప్పించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** సకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఇప్పించాలని ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ధోనికెన రేణుక వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ గ్రామంలో 130 పశువులకు టీకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గేదలు, ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నూకల శ్రీను, వార్డు సభ్యులు, ఎల్ఎస్ఏ శేఖర్ వెటర్నరీ అసిస్టెంట్లు రాఘవేంద్ర, శంషాద్దీన్ రైతులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్లు పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సహకారంతో సైకిల్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ మంజూషరాణి, బాల కోటిరెడ్డి, జిల్లా సిఎంఒ పెసరు లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పలుగుల ఆగేశ్వర్ రావు, గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి.బాలమణి, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు కళ్యాణ్ పంగులూరి, గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, ఝాన్సీ ప్రేమానంద, జూబ్లీహిల్స్ సెక్రెటరీ లక్ష్మి వీసిరెడ్డి, భువనగిరి సెక్రటరీ తవిటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి, నాగరాజు కాచారం, ఉప సర్పంచ్ బాల నరసయ్య, వార్డు సభ్యులు, ఎన్నిక అధ్యక్షుడు కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి, ఫాస్ట్ అధ్యక్షుడు నర్సింగరావు, వెంకటేశం, సూరంపల్లి మురళి, టి.రవి, పలుగుల మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశోధనా రంగంపై దృష్టి సారించండి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అధ్యాపకులు పరిశోధనా రంగంపై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ నరేందర్ రెడ్డి సూచించారు.సోమవారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల అకాడమిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థలకు న్యాక్ గుర్తింపులో పరిశోధనలది కీలక స్థానం అని అందుకే అధ్యాపకులు పరిశోధనల్లో నిమగ్నం కావాలని అన్నారు. కళాశాల స్థాయిలో రీసెర్చ్ కమిటీని ఏర్పాటు చేసి స్కోపస్, పీర్ రివ్యూడ్ పత్రికల్లో ప్రతి అధ్యాపకుడు కనీసం ప్రతి విద్యా సవత్సరానికి రెండు ఆర్టికల్స్ అయినా ప్రచురించాలని సూచించారు.ప్రిన్సిపాల్ ప్రొఫసర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ కళాశాలలో ప్రతి నిర్ణయం ప్రభుత్వ మార్గదర్శకాలు,మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉత్తర్వుల మేరకు ఉంటుందని తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ ఎ.పుల్లారావు,కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి,అకాడమిక్ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు,పరంగి రవి కుమార్,అంతటి శ్రీనివాసులు,శ్రీనివాస్ రెడ్డి,నాగరాజు అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ సిఫారసులు అమలు : సదస్సు డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యా కమిషన్ విద్యపై చేసిన సిఫారసుల్లో స్వాగతించదగిన అంశాలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం ఆమోదించి వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉందని మాజీ శాసన మండలి సభ్యులు అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. అఖిల భారత్ బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని రెన్సీ రెస్టారెంట్‌లో సోమవారం సమాన విద్యా,సామాజిక న్యాయం కోసం" తెలంగాణ విద్యా కమిషన్ చేసిన సిఫారసులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకు తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య, పడిపోతున్న విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలంటే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని సూచించారు. ఎంవి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ రేగటి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత విద్యా పరిస్థితులకు అనుగుణంగా విద్యా కమిషన్ రూపొందించిన సిఫారసులు పిల్లల కేంద్రంగా ఉన్నాయని తెలిపారు. సమాన విద్యా అవకాశాలు, సామాజిక న్యాయం సాధించేందుకు అన్ని వర్గాల ప్రజలతో సంప్రదింపులు జరిపి ఈ సిఫారసులను రూపొందించారని వివరించారు.ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గంజి వేణుగోపాల్, సమన్వయకర్త ఏర్ర శివరాజు, రాష్ట్ర కోకన్వీనర్లు శ్రీనివాస్, జంపాల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు శాంసన్, యాదయ్య, పెద్దయ్య, కరుణాకర్, క్రిస్టోఫర్, పురుషోత్తం, శోభారాణి, విజయలక్ష్మి, లలిత, వినోద తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఇవి బస్సుల విధానానికి వ్యతిరేకంగా ఆర్‌టిసి జెఎసి నిరసన




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ డిపో జెఎసి ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యుత్ (ఈవి) బస్సుల విధానాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఆర్‌టిసి డిపో వద్ద ఆర్‌టిసి కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకులు బి.నరేందర్,బాసాని వెంకటయ్య,జిల్లా జెఎసి నాయకులు ఎన్‌ఆర్‌సీ రాజు,టీజే రావు, డిపో జెఎసి ఎసి నాయకులు ఏఎల్ స్వామి, ఎండి అన్వర్, ఎస్‌సి,ఎస్‌టి నల్లగొండ జిల్లా అధ్యక్షులు,కార్యదర్శులు కెవెల్ నాయక్,కడియం రమేష్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం స్వయంగా ఈవి బస్సులను కొనుగోలు చేసి ఆర్‌టిసికి అప్పగించి,సంస్థ ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల పట్ల వివక్ష చూపిందని,ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రైవేట్ ఈవి బస్సులను ప్రవేశపెట్టి సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కొత్త నియామకాలు చేపట్టకుండా ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లు,ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.ఈనేపథ్యంలో రాష్ట్ర జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, రానున్న రోజుల్లో జేఏసీ ఆధ్వర్యంలో జరిగే పోరాటాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్మికులు ఎన్. సైదులు, కె.అంజయ్య, టీఎస్ రెడ్డి,కెవెల్ రెడ్డి, ఎస్‌ఆర్ రెడ్డి, చి.వెంకన్న, ఎండి లతీఫ్, ఎం.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివ్ ప్రతాప్ శుక్లా ను సోమవారం లోక్‌భవన్‌లో నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గవర్నర్ గారిని శాలువా,పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల గురించి ఆయనకు వివరించారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో చేసిన సేవలు, యూత్ వాలంటీర్ల సేవలు, రక్తదాన శిబిరాలు,మహాప్రస్థానం వాహనం,పేదలకు తక్కువ ధరలో జనరిక్ మందుల అందజేత వంటి కార్యక్రమాలను వివరించారు.అదేవిధంగా వెనుకబడిన ప్రాంతమైన దేవరకొండ డివిజన్‌లోని ఆదివాసీ ప్రాంతాలను పర్యటించవలసిందిగా గవర్నర్‌ను ఆహ్వానించారు.దీనిపై స్పందించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, తప్పకుండా దేవరకొండ ప్రాంతాన్ని సందర్శిస్తానని తెలిపారు.జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు.త్వరలోనే జిల్లా రెడ్ క్రాస్ సొసైటీని సందర్శిస్తానని,జిల్లాలోని యూత్ వాలంటీర్ల సేవలను మరింతగా వినియోగించుకోవాలని సూచనలు ఇచ్చారు.

## ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట

**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్ :** మండలంలోని గాత్ తండా గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పున: ప్రతిష్ట కొరకు సోమవారం గ్రామ సర్పంచ్ మన్ని భాష నాయక్ శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయ స్వామి నూతన విగ్రహ, ప్రతిష్ట కొరకు గ్రామస్తులు మరియు ఇతర దాతల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అన్నారు, ఏప్రిల్ 2న విగ్రహ పునః ప్రతిష్ట ప్రారంభిస్తున్నట్లు అలాగే 3న శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు,ఈకార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు అందరూ కలిసి ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో వారి వెంట ఉప సర్పంచ్ సీతారాం నాయక్, వార్డు సభ్యులు చందు నాయక్,శ్రీరాములు ,నాయకులు నందా నాయక్, రవి నాయక్, పులియ బాలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జానారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్



**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్:** మాజీ మంత్రి, సిపిఎల్‌పి నేత కుందూరు జానారెడ్డిని హైదరాబాదులోని తన నివాసంలో తూటిపేట తండా సర్పంచ్ మెగావత్ మనీ భాష నాయక్, పాలకవర్గ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం, ఆంజనేయస్వామి విగ్రహ పున:ప్రతిష్ట మరియు వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ సందర్భంగా ఆహ్వాన పత్రికను జానారెడ్డికి అందజేశారు.ఈసందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయస్వామి నూతన విగ్రహం ప్రతిష్ట ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని, ఎలాంటి సంఘటనలు జరగకుండా ఘనంగా ఉత్సవాలు జరగాలని కోరారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్,ఉపసర్పంచ్ సీతారాం నాయక్, వార్డు సభ్యులు లలిత, ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులు, నిర్బంధాలు ఉద్యమాలను ఆపలేవు

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో మలిదశ ఉద్యమకారులు మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్ ,నాయకులు స్వామినాయక్,శంకర్ నాయక్ పోలేపల్లి అంజిలను తిరుమలగిరి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులు నిర్బంధాలతో ఉద్యమాలను అణచలేరని ప్రభుత్వం మలి ఉదమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, మీరు ఉద్యమలను అణిచి వేయాలని నియంత గా వ్యవరిస్తే చరిత్రలో జరిగిన సంఘటనలు తిరిగేసి చూడు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడతాది అనే విషయం మర్చిపోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నాసిరకం మట్టితో రింగు రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి పాలకూరి రవిగౌడ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతో నల్లగొండ పట్టణంలో చేపడుతున్న రింగు రోడ్డుకు సంబంధించి చుట్టూ ఉన్న చెరువుల,కుంటల నుండి మట్టిని అక్రమంగా తొవ్వుకొచ్చి నాణ్యత లేని మట్టితో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు అని అన్నారు.చెరువులకు ,కుంటలకు మట్టిని తరలించడానికి ఎలాంటి అనుమతులు కూడా లేవని ఈ విధంగా చెరువుల్లో బంక మట్టిని అక్రమంగా తరలిస్తే వర్షాలకు వచ్చి చెరువులో చేరినటువంటి నీరు వెంటనే ఇంకిపోయే ప్రమాదం ఉందన్నారు.నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టు పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## వైభవంగా లక్ష కుంకుమార్చన శ్రీ హయగ్రీవ ఇష్టి యజ్ఞం



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** పట్టణంలోని ఎన్ఎస్‌పి క్యాంపు మైదానంలో శ్రీ భాష్యకార సిద్ధాంత పీఠ వ్యవస్థాపక చార్యులు శ్రీ భూషిత శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి సంకల్పంతో ఆయన పర్యవేక్షణలో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి యాగం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.30గంటలకు మంగళ సౌభాగ్యాల కోసం లక్ష కుంకుమార్చన, శ్రీ హయగ్రీవ ఇష్టి యజ్ఞం, సాయంత్రం 6గంటలకు ప్రవచన వేదికపై సామహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పండిత ప్రవచనాలు, సాంస్కృతిక, కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్నాటి రమేష్, కార్యవర్గ సభ్యులు బండారు కుశలయ్య, గౌరు శ్రీనివాస్, బండారు కుశలయ్య, చీదళ్ల శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మాచర్ల రాములు మృతి బాధాకరం

**ప్రజాపక్షం/డిండి :** సిపిఐ సినియర్ నాయకులు మాచర్ల రాములు ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం అని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి అన్నారు. సోమవారం తవక్లాపూర్ గ్రామంలో మాచర్ల రాములు పార్థివ దేహంపై సిపిఐ జెండాను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. రాములు, భార్య ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురై రాములు అక్కడికక్కడే మృతిచెందడంతో రాములు భార్య ఇప్పటికి ఆసుపత్రిలో చికిత్స పొందడం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. రాములు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారని రాములు మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. నివాళులర్పించిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, శైలేష్, చక్రి, వెంకటేశ్వర్లు, శ్రీనయ్య, నవీన్, నరేష్, అలయ్య, మల్లేష్, జయరాజు, సంజీవ, గోపాల్ ఉన్నారు.

## పశువుల సంత ఏర్పాటు

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండల కేంద్రంలో పశువులు,మేకలు,గొర్రెల అంగడి సంతను ఏప్రిల్ 2వ తేదీ గురువారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ శిరీష లోకేష్ గౌడ్ తెలిపారు.మండల కేంద్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ సంతను ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు.సంతకు వచ్చే పశువులు, మేకలు, గొర్రెల కోసం తగిన నీటి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.పరిసర ప్రాంతాల్లో పశువుల సంత లేకపోవడంతో రైతులు,వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.చిరు వ్యాపారులు తమ వస్తువులను క్రయవిక్రయాలు చేసుకునేందుకు కూడా ఈ సంతలో అవకాశం కల్పిస్తామని అన్నారు.సంతకు వచ్చే వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాత బస్టాండ్ ప్రాంతాన్ని విశాలంగా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పశువుల వ్యాపారులు, గొర్రెలు, మేకల క్రయవిక్రయదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కమ్యూనిస్టు పార్టీలోనే సామాన్యులకు గౌరవం : బాగం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కమ్యూనిస్టు పార్టీలోనే సామాన్యులకు గౌరవం ఉంటుందని మారిన రాజకీయ సామాజిక పరిస్థితుల్లో సామాన్యులకు సైతం ఉన్నత పదవులు కమ్యూనిస్టు పార్టీలోనే లభిస్తాయని హేమంతరావు తెలిపారు. ఎన్నికలు అంటేనే డబ్బు ఖర్చు చేయడం సామ దాన దండోపాయాలకు వేదికగా మారిన ఈ రోజుల్లో సామాన్యమైన వ్యక్తిని మేయర్‌ను చేసి కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షమేనని రుజువు చేసిందన్నారు. ఇటీవల జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ పక్షాన మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌ను సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు, బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టు పార్టీ ఎజెండా అని అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రణాళికాబద్ధ కార్యాచరణ, అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. సన్మాన గ్రహీత మూడ్ గణేష్ మాట్లాడుతూ సామాన్యమైన కార్యకర్తగా ఉన్న తనకు కమ్యూనిస్టు పార్టీ ఒక అద్భుత అవకాశాన్ని కల్పించిందని నాలాంటి సామాన్యులకు అవకాశాలు ఇచ్చి ఉన్నత స్థానాలకు చేర్చడం కమ్యూనిస్టు పార్టీలోనే సాధ్యమన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశంతో పేదల అభ్యున్నతికి ముఖ్యంగా కొత్తగూడెం కార్పోరేషన్ అభివృద్ధికి శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాతో కలిసి కృషి చేస్తానన్నారు. సిపిఐ జిల్లా సమితితో పాటు వివిధ మండల సమితులు, ప్రజా సంఘాలు మేయర్ గణేష్‌తో పాటు విజయంలో కీలక భూమిక పోషించిన ఎస్‌కె సాబీర్‌పాషాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు కె. నారాయణ, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# యాదవ సర్పంచులు, కౌన్సిలర్లకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ యాదవ మహసభ ఆధ్వర్యంలో జిల్లాలోని యాదవ సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. సోమవారం ఖమ్మం మధురానగర్ కాలనీలో గల శ్రీ గోకులకృష్ణ సేవా సమితి ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ యాదవ మహసభ ఆధ్వర్యంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యాదవ మహసభ వ్యవస్థాపక అధ్యక్షులు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూణం యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన వారు కృషి చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకోవాలన్నారు. రాజకీయంగా మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. సభాధ్యక్షులుగా వైరా మాజీ మార్కెట్ ఛైర్మన్ తుమ్మా రోశయ్య వ్యవహరించారు. బిసి సంఘం నేతలు, ఆర్‌జెసి కృష్ణ, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగాని వెంకన్నగౌడ్, ఆర్కా హాస్పటల్ ప్రముఖ వైద్యులు బీశం వెంకటేశం యాదవ్, యాదవ మహసభ రాష్ట్ర కార్యదర్శి మేకల సుగుణారావు, జిల్లా అధ్యక్షులు కోడి లింగయ్య, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్సూర్, మహిళా అధ్యక్షురాలు చిత్తారు ఇందుమతి, మహిళా కార్యదర్శి కమల, యూత్ అధ్యక్షులు మల్లేష్, రాష్ట్ర నాయకులు గంగరాజు, మాజీ జెడ్పిటిసి హైమావతి, ఎంపిపి సత్యం, పలువురు యాదవ ప్రముఖులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లునందిని విక్రమార్క ఆధ్వర్యంలో మధిరలోని భట్టి క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. తనకుమారిడి వివాహ శుభ సందర్భంగా మధిర పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి నూతన వస్త్రాలను బహుకరించారు. పట్టణ పరిశుభ్రత, అభివృద్ధిలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారు అహర్నిశలు శ్రమించి ప్రజలకు సేవ చేస్తున్నారని ఈ సందర్భంగా నందిని కొనియాడారు. నూతన వస్త్రాలను అందుకున్న కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. తమను గుర్తించి గౌరవించినందుకు మల్లు మల్లు నందినికి, భట్టివిక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కమీషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు వెంకటరమణగుప్తా, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, అద్దంకి రవికుమార్, దుంపా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రబీ సీజన్‌లో పండిన మొక్కజొన్నలు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సిపిఎం డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల్లో పైగా రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుఓగలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు మొక్కజొన్నలు క్వింటాకు రూ.1600, రూ.1700లకు కొనుగోలు చేస్తున్నారని, దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.



ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు రూ.2400లు ఉందని, మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల ఘట్టం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఏప్రిల్ 9న జరగబోయే హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ఘట్టం సోమవారంతో ముగిసినట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్యలు తెలిపారు. అద్యక్ష పదవికి కొణతం శ్రీనివాసరెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్ష పదవికి కానూరి ప్రదీప్తి, కుక్కడపు సైదులు, జక్కుల వీరయ్య, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి ఆర్‌వి రమణారెడ్డి, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, భూక్య నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పదవికి కోలా రమాదేవి, నీలం విజయదుర్గ, గ్రంధాలయ కార్యదర్శి పదవికి దూళిపాళ శ్రీనివాసరావు, మద్దుల నాగేశ్వరరావు, కోశాధికారి పదవికి గొట్టె ప్రశాంత్, బాణోతు శంకర్, పచ్చిపాల గురుమూర్తి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి పదవికి రమావత్ అడవి రాముడు, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, మహిళ కార్యవర్గ సభ్యుల పదవికి జుట్టుకొండ సంధ్యారాణి, షేక్ మౌలాబి, పురుష కార్యవర్గ సభ్యుల పదవికి షేక్ నాగపాషా, నర్సింగ్ సతీష్, పల్లె అలెగ్జాండర్, పండ్ల నాగరాజు, చిట్టిపోలు రమేష్, జక్కుల నవీన్, దాసరి మోహన్, కందుల శంభిరెడ్డిలు నామినేషన్లు దాఖలు చేసినట్లుగా ఎన్నికల అధికారులు తెలిపారు.

# రథోత్సవంతో శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఘన ముగింపు



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలం యరగండ్లపల్లిలో ఐదు రోజులుగా అత్యంత వేడుకగా కొనసాగిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రథోత్సవంతో ఘనంగా ముగిశాయి. సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో ఉత్సవాలు కనులపండువగా జరిగాయని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పురోహితుడు హరిబాబు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు

**బొడ్డుపల్లి కృష్ణ**



**ప్రజాపక్షం/దేవరకొండ :** అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు అని బిఆర్‌ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. సోమవారం నిరుద్యోగుల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ముందస్తు అరెస్టుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను ఎన్నికల ముందు నమ్మించి, తీరా గద్దెనెక్కాక నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలిపారు. వయోపరిమితిని 46 నుండి 34కి తగ్గించి, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న రేవంత్ సర్కార్‌అని ఆయన అన్నారు. తొలి ఏడాది 2లక్షల ఉద్యోగాలు ఎక్కడ అని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ లేదు అని, నిరుద్యోగ భృతి ఏమైందని, బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్ ఊసే లేదని ఆయన తెలిపారు.

# సింథటిక్ ట్రాక్ పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సింథటిక్ ట్రాక్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం సర్దార్ పటేల్ మైదానంలో నిర్మాణంలో ఉన్న సింథటిక్ ట్రాక్ పనుల ను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాక్ నిర్మాణంలో మిగిలిన పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

# గంజి నారాయణకు టిడిపి నివాళి

**ప్రజాపక్షం/ మధిర :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి తుది వరకు పార్టీలో కొనసాగిన సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గంజి నారాయణ ఇటీవల మృతి చెందిన సంగతి విధితమే. సోమవారం దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో ఆయన సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన అకాల మృతి టిడిపికి తీరని లోటన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్‌బాబు, ఐటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి వేమూరి సునీల్, మధిర రూరల్ మండల అధ్యక్షులు మార్నిడి పుల్లారావు, నాయకులు చెరుకూరి కృష్ణారావు, వట్టికొండ రామమ్మోహన్‌రావు, వాసిరెడ్డి ఉపేంద్ర, వాసిరెడ్డి కృష్ణ, ఈశ్వర్, మాదల నర్సింహారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.